ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5 సిద్దిపేట

గురువారం 26 సెప్టెంబరు 2024



మంత్రి గారూ..
దుబ్బాకపై దయచూపరూ?
● నేడు దుబ్బాకకు ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ
● సమస్యలతో స్వాగతం
● నిధుల విడుదలపై నీలినీడలు
8



పరిశ్రమలకు వెళ్లే దారిలో రోడ్డుపై వంటావార్పు నిర్వహించి భోజనాలు చేస్తున్న భూనిర్వాసితులు

పూర్తిస్థాయి పరిహారం అందే వరకూ
ఆందోళనలు కొనసాగిస్తాం

● టీజీఐఐసీ వద్ద నిర్వాసితుల వంటావార్పు

వర్గల్, సెప్టెంబరు 25: వర్గల్ మండల కేంద్రంలోని టీజీఐఐసీ భూముల వద్ద భూనిర్వాసితుల ఆందోళన కార్యక్రమాలు బుధవారం మూడో రోజుకు చేరుకున్నాయి. నిర్వాసితులు నిర్మాణాలు జరుగుతున్న పరిశ్రమల వద్ద రోడ్డుపై బైఠాయించి వంటావర్పు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వే నంబరు 1495, 1510లో వర్గల్‌కు చెందిన సుమారు 200 మంది భూములు కోల్పోయారని తెలిపారు. ఎకరాకు రూ.10 లక్షలు ఇచ్చి తమకు జీవనాధారమైన పంటలు పండించే వ్యవసాయ భూములను అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం బలవంతంగా లాక్కుందని చెప్పారు. రైతులకు ప్లాట్లు ఇస్తామని చెప్పి టోకెన్ మాత్రమే ఇచ్చారన్నారు. ఇప్పటివరకు ప్లాట్లు చూపించలేదని, రెండేళ్లుగా భూములు పోవడంతో రోడ్డున పడ్డామని, ఉపాధి లేక అనేక ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు పేర్కొన్నారు. తమకు పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదని వాపోయారు. ఎకరానికి రూ.20లక్షలు ఇవ్వాలని, పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని, ప్లాట్లు చూపించాలని, 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికీ ఉపాధి కోసం దారి చూపించాలని కోరారు. లేదంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంతవరకు పరిశ్రమలలో నిర్మాణ పనులు జరగనివ్వబోమని తేల్చిచెప్పారు.

నారింజ వాగులో వ్యక్తి గల్లంతు

ఫలించని అధికారుల గాలింపు చర్యలు



వాగులో కొట్టుకుపోతున్న వ్యక్తులు

జహీరాబాద్, సెప్టెంబరు 25 : మండల పరిధిలోని బూచనెల్లి-బరూర్ గ్రామాల మధ్య నారింజవాగు ప్రవాహంలో వ్యక్తి గల్లంతయ్యాడు. బూచనెల్లికి చెందిన ఇస్మాయిల్ కొన్నేళ్ల క్రితమే బీదర్‌లో స్థిరపడ్డారు. బీదర్‌కు చెందిన షాకీర్(40), ఇస్మాయిల్ కలిసి బుధవారం మధ్యాహ్నం బైక్‌పై బరూర్ మీదుగా జహీరాబాద్ వస్తున్నారు. నారింజ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో బూచనెల్లి-బరూర్ గ్రామాల మధ్య నారింజవాగు లోలెవల్ బ్రిడ్జి మీదుగా ప్రవహిస్తున్నది. ప్రవాహ ఉధృతిని లెక్కచేకుండా బైక్‌పై దాటేందుకు ప్రయత్నిస్తుండగా బైక్‌తో సహా కొట్టుకుపోయారు. వాగులో కొట్టుకుపోతున్న ఇస్మాయిల్‌కు మధ్యలో ఉన్న చెట్టు ఆసరా దొరకడంతో దానిని పట్టుకున్నాడు. రక్షించండని కేకలు వేయడంతో సమీపంలో ఉన్నవారు చేరుకుని రక్షించారు. షాకీర్ నీటిలో కొట్టుకుపోయారు. విషయం తెలుసుకున్న స్థానిక అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే కర్ణాటక పోలీసులకు, అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇస్మాయిల్‌ను బూచనెల్లిలో ఉన్న బంధువుల ఇం టికి తీసుకువెళ్లారు. జహీరాబాద్ తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో మహేందర్‌రెడ్డి, ఆర్ఐలు రుక్మోద్దీన్, యాదిలాల్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బూచనెల్లిలో ఉన్న ఇస్మాయిల్‌ను పరామర్శించారు. జహీరాబాద్, కర్ణాటక పోలీసులు, అధికారులు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ ఇంకా తెలియలేదు.

నిర్లక్ష్యం తగదు

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి - అధికారులకు మంత్రి సురేఖ హెచ్చరిక



జిల్లా సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

● డీఆర్‌సీ మీటింగ్‌లో శాఖలవారీగా సమీక్ష
● ఇకపై రెగ్యులర్‌గా వస్తానన్న ఇన్‌చార్జి మంత్రి
● ఎక్కడి పనులు అక్కడే నిలిచాయి : హరీశ్‌రావు
● సమస్యలు ఏకరువు పెట్టిన ఎంపీ, ఎమ్మెల్యేలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, సెప్టెంబరు 25: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్న అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులపై చర్యలు తప్పవని అటవీ, దేవాదాయశాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. ప్రజలకు అందుబాటులో ఉండడమేగాకుండా జవాబుదారీతనంతో వ్యవహరించాలని ఆమె సూచించారు. బుధవారం సిద్దిపేట జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతీరుపై కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం జరిగింది. కలెక్టర్ మనుచౌదరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, దుబ్బాక, జనగామ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయం, విద్య, వైద్యం, విద్యుత్, పౌరసరఫరాలు, అటవీ, సెట్విన్, ఆర్అండ్‌బీ, మత్స్యశాఖలపై సమీక్షించారు.

సమస్యలపై సానుకూలంగా..

మంత్రి కొండా సురేఖ తన అనుభవాన్ని రంగరిస్తూ సమీక్ష నిర్వహించారు. శాఖలవారీగా ఉన్న సమస్యల గురించి ఓ పక్క మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి పదేపదే ఆమె దృష్టికి తెచ్చే ప్రయత్నం చేశారు. ఈ సమస్యల గురించి సంబంధిత అధికారులను మంత్రి ప్రశ్నించారు. ఎప్పటిలోగా సమస్యలు పరిష్కరిస్తారో చెప్పాలని, మళ్లీ వచ్చే సమావేశానికి ఈ సమస్యలు పెండింగ్‌లో ఉండొద్దని సూచించారు. ప్రతీ సమస్యకు తగిన పరిష్కారం చూపాలని పక్కనే ఉన్న కలెక్టర్‌ను పలుమార్లు ఆదేశించారు. సమస్యను పరిష్కరించినట్లుగా సదరు కాపీలను ప్రజాప్రతినిధులకు పంపించాలని పేర్కొన్నారు. మీటింగ్ ఆద్యంతం ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఆమె సమన్వయం చేశారు. పార్టీలకు అతీతంగా వ్యవహరిస్తూ బీఆర్ఎస్, బీజేపీకి చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చెప్పిన సమస్యల గురించి కలెక్టర్‌తో చర్చించారు. పూర్తి వివరాలను తన సిబ్బంది ద్వారా సేకరించారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్

అసంపూర్తి పనులను పూర్తి చేయాలి : హరీశ్

గడిచిన పదినెలలుగా సిద్దిపేట నియోజకవర్గంలోని పనులన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఈ సమీక్షలో మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వెయ్యి పడకల ఆస్పత్రి ఇప్పటికే 80శాతం పూర్తయ్యిందని, మరో 20శాతం పూర్తిచేస్తే ప్రజలకు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. వెటర్నరీ కళాశాల పనులను నిలిపివేశారని, రహదారుల నిర్మాణాలను ఆపేశారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో విడుదలైన నిధులను రద్దు చేశారని గుర్తుచేశారు. కొత్త పనుల సంగతి పక్కనబెడితే అసంపూర్తి పనులను పూర్తి చేయించాలని వినతిపత్రాలు సమర్పించారు. నర్సింగ్ కళాశాల విద్యార్థులకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని, రిజర్వాయర్లలో భూములు కోల్పోయిన నిర్వాసితులతో చేపల సొసైటీలు చేపట్టాలని కోరారు. రెగ్యులర్ వ్యవసాయాధికారి లేక జిల్లాలో వ్యవసాయం అస్తవ్యస్తంగా తయారైందన్నారు. వెంటనే రెగ్యులర్ డీఏవోను నియమించాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

రైతులకు పనిముట్లు ఇవ్వాలి : రఘునందన్

వ్యవసాయానికి సంబంధించి రైతులకు పనిముట్లు ఇవ్వాలని, ఈ నిధులను పనిముట్ల కోసమే ఖర్చు చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. ఇక చేపల పెంపకం సొసైటీల్లో తుక్కాపూర్ వాసులకు చోటు కల్పించాలని కోరారు. మున్సిపాలిటీల్లో ప్లాస్టిక్ నుండి డీజిల్ తయారుచేసే యూనిట్స్‌ను ఏర్పాటు చేయాలని, కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన స్వచ్ఛభారత్ మిషన్‌ను వినియోగించుకోవాలని సూచించారు.

మహిళా సంఘాలకు కమీషన్లేవి : ప్రభాకర్‌రెడ్డి

ధాన్యం కొనుగోలులో కీలకపాత్ర పోషించిన మహిళా సంఘాలకు కమీషన్లు ఇవ్వలేదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సన్న వడ్ల విషయంలో ఎలాంటి మార్గదర్శకాలూ విడుదల చేయక పోవడం వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. దుబ్బాక వందపడకల ఆస్పత్రిలో వైద్యులున్నా వైద్య పరికరాలు లేవని అసహనం వ్యక్తం చేశారు. వైద్యసేవలపై దృష్టిపెట్టాలని కోరారు.

సమీక్షలో హైలైట్స్..

● జిల్లాకు రెగ్యులర్ డీఏవో లేకనే వ్యవసాయపరంగా ఇబ్బందులు వస్తున్నాయని మాజీ మంత్రి హరీశ్‌రావు చెప్పగానే వెంటనే రెగ్యులర్ డీఏవోను నియమించడానికి వ్యవసాయశాఖ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపాలని మంత్రి కొండా సురేఖ కలెక్టర్‌ను ఆదేశించారు.
● రూ.500కే సిలిండర్ పొందుతున్న కుటుంబాల జాబితా సక్రమంగా లేకపోవడంపై జిల్లా సివిల్ సప్లయ్ అధికారులపై మంత్రి సురేఖ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. నెలనెలా తీసుకునే వేతనాలపై లెక్కుంటుంది కానీ పేదల పథకాలపై లెక్కలు ఉండవా? అని ప్రశ్నించారు.
● ఓ వైపు సమీక్ష జరుగుతూ ఉంటే మరోవైపు అధికారులు తమ ఫోన్లలో మునిగారు. ఇంకొందరైతే కునుకు కూడా తీశారు .
● కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రి, బీజేపీకి చెందిన ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉండడంతో సమీక్ష గందరగోళంగా మారుతుందని అంతా భావించారు. కానీ ప్రజల సమస్యలపై నేతలంతా సమన్వయంతో చర్చించడం విశేషం.



సమస్యలపై చర్చిస్తున్న మంత్రి సురేఖ, ఎంపీ రఘునందన్, మాజీ మంత్రి హరీశ్‌రావు



సమీక్షకు హాజరైన అధికారులు

పార్టీ కోసం కష్టపడ్డ వారికే పదవులు

గజ్వేల్, సెప్టెంబరు 25: కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసిన వారికి పదవులు ఇస్తామని ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గజ్వేల్ మండలం కొడకండ్ల శివారులో గజ్వేల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో ఆమెకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ కష్టపడి పార్టీని అధికారంలోకి తెచ్చిన కార్యకర్తల శ్రమను గుర్తిస్తున్నామని, వారికి నామినేటెడ్ పోస్టుల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం కల్పించి ప్రోత్సహించనున్నట్లు చెప్పారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ పాలకమండలి సన్మాన మహోత్సవానికి హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జులు పూజల హరికృష్ణ, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, ఆయా మండలాల కాంగ్రెస్ బాధ్యులు రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, టీపీసీసీ నాయకులు సాజిద్ బేగ్, మహేందర్‌రెడ్డి, సురేశ్, రాములు పాల్గొన్నారు.



కొడకండ్ల వద్ద మంత్రి కొండా సురేఖకు స్వాగతం పలుకుతున్న నాయకులు



సెల్‌ఫోన్‌లో బిజీ..!

ప్రభుత్వం ఏర్పడిన దాదాపు 10నెలల తర్వాత జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండాసురేఖ సిద్దిపేట అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. దాదాపు పది శాఖల పైన సుదీర్ఘంగా చర్చించారు. అయితే, సమావేశం జరుగుతుండగా కొందరు అధికారులు ఫోన్లలో సోషల్ మీడియా, యూట్యూబ్‌లు చూస్తూ కాలక్షేపం చేశారు.

- సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 25



నిషేధిత జాబితాలో రైతుల భూములు

● రైతుబంధు రాదు.. క్రాప్‌లోన్ ఇవ్వరు..!!
● ఆపద వస్తే అమ్ముకునేందుకు వీలుండదు
● ఆందోళనలో గిరిజన రైతులు
● పట్టాలు ఇప్పించాలని మంత్రి 'పొన్నం'కు వేడుకోలు

అక్కన్నపేట, సెప్టెంబరు 25: వారంతా తాత ముత్తాల కాలం నుంచి సీలింగ్ భూములపై ఆధారపడి జీవిస్తున్నారు. అయితే ఆ భూములను ధరణిలో పోర్టల్‌లో నిషేధిత జాబితాలో చేర్చడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని దశాబ్దాలుగా పట్టాలు ఇవ్వాలని వేడుకుంటున్నా ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. ప్రభుత్వం నుంచి రైతుబంధు అందక, బ్యాంకులో క్రాప్‌లోనూ ఇవ్వక, ఆపద వస్తే భూములు అమ్ముకోలేక రైతులు అరిగోస పడుతున్నారు.

అక్కన్నపేట మండలంలోని నందారం గ్రామ రెవెన్యూ పరిధిలో 288 సర్వే నెంబర్లలో మొత్తం 1456.26 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో 30 సర్వే నెంబర్లలో 124 ఎకరాల పట్టాభూమి ఉండగా, 15 సర్వే నెంబర్లలో 400 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. మిగతా 243 సర్వే నెంబర్లలో ఉన్న 932 ఎకరాల సీలింగ్ భూమిని అధికారులు ధరణి పోర్టల్‌లో నిషేధిత జాబితాలో నమోదు చేశారు. 932 ఎకరాల సీలింగ్ భూమిని కపూర్‌నాయక్‌తండా గ్రామపంచాయతీకి చెందిన గిరిజన రైతులు తాత ముత్తాల కాలం నుంచి సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత ప్రభుత్వం భూప్రక్షాళనలో పట్టాలిస్తుందని ఆశపడ్డారు. పట్టాలు ఇవ్వకపోగా ధరణి పోర్టల్‌తో తమ భూములను నిషేధిత జాబితాలో చేర్చిందని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే రైతుబంధు తమకు వర్తింపజేయడం లేదు. ఇంతకాలం ఆర్‌వోఆర్ పట్టాలపై క్రాప్ లోన్ ఇచ్చిన బ్యాంకు అధికారులు ఇప్పుడు ఇవ్వడం లేదు. పెళ్లిలకు, ఇతర అవసరాలకు అమ్ముకుందామన్నా కూడా వీలు లేకుండా పోయిందని వాపోతున్నారు. సాగు చేసుకుంటున్న భూములను పట్టాలు చేయడం లేదని నిరసిస్తూ గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరిస్తామని అప్పట్లో గిరిజన రైతులు పిలుపునిచ్చారు. దీంతో అధికారులు కపూర్‌నాయక్‌తండాకు వెళ్లి ఎన్నికలు ముగిసిన తర్వాత సాగు చేసుకుంటున్న భూములను రిజిస్ట్రేషన్ చేసి పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు.. ఎన్నికలు పూర్తయ్యాక ఏ ఒక్కరూ ఇటువైపు రావడం లేదని తమను పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ తీసుకొని సాగు చేసుకుంటున్న వారికి పట్టా పాసు బుక్కులు ఇప్పించాలని వేడుకుంటున్నారు.



పట్టాలు చేయాలని వేడుకుంటున్న గిరిజన రైతులు



అక్కన్నపేట మండలం కపూర్‌నాయక్‌తండాలో నిషేధిత జాబితాలో చేర్చిన భూములు

పట్టాలు చేయమంటే నిషేధిత జాబితాలో చేర్చారు

- బానోతు సంతోష్‌నాయక్, మాజీ సర్పంచ్, కపూర్‌నాయక్‌తండా, అక్కన్నపేట



తాత ముత్తాతల కాలం నుంచి గిరిజన రైతులు సాగు చేసుకుంటున్న 932 ఎకరాల భూములకు పట్టాలు చెయాలని దశాబ్దాల కాలంగా పాలకులను, అధికారులను వేడుకుంటున్నాం. కానీ గత ప్రభుత్వం పట్టాలు చేయకుండా ఆ భూములను నిషేధిత జాబితాలో పెట్టింది. ఇప్పటికైనా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ తీసుకొని పట్టాలు ఇప్పించి గిరిజన రైతులకు న్యాయం చేయాలి.

రైతుబంధు రావడం లేదు

- అజ్మీర ఆలియా, గిరిజన రైతు, కపూర్‌నాయక్‌తండా, అక్కన్నపేట



మా తాతల కాలం నుంచి ఆరు ఎకరాలు వ్యవసాయ భూమి సాగు చేసుకుంటున్నాం. పట్టాలు చేయాలని కార్యాలయాల చుట్టూ తిరిగి అలసిపోయాం. రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు మావి. పట్టాలు లేవనే కారణంతో ప్రభుత్వం నుంచి వచ్చే రైతుబంధు కూడా రాలేదు. సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇప్పించాలని వేడుకుంటున్న.

విద్యార్థులను బాధ్యత గల
పౌరులుగా తీర్చిదిద్దాలి

● ట్రెస్మా గురువందనంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటకల్చరల్, సెప్టెంబరు 25 : విద్యార్థులను ర్యాంకులు తెచ్చే యంత్రాలుగా కాకుండా బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. మార్కులు, ర్యాంకులు ఎంత ముఖ్యమో.. మన సంస్కృ తి సమాజం, గురువులు, తల్లిదండ్రుల పట్ల గౌరవ మర్యాదలు నేర్పించడం కూడా అంతే ముఖ్యమని అభిప్రాయం వ్యక్తం చేశారు. ట్రెస్మా ఆధ్వర్యంలో సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గురువందనం కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొని ప్రైవేట్ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తల్లిదండ్రుల తర్వాత విద్యాబుద్ధులు చెప్పే గురువులు చెరగని ముద్ర వేస్తారని అన్నారు. ప్రభుత్వ విద్య, ప్రైవేట్ విద్య అనే తేడా ఉండదని, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడైనా, ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుడైనా విద్యార్థులు గురువుగానే గౌరవిస్తారని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రైవేట్ ఉపాధ్యాయులను కించపరిచే విధంగా మాట్లాడటం బాధాకరమన్నారు. ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరచండి కానీ ప్రైవేట్ పాఠశాలలను తక్కువ చేసి చూడటం సరికాదని సూచించారు. ఒకరిని మెచ్చుకోవడానికి మరొకరిని కించపరిచేవిధంగా మాట్లాడడం కరెక్టు కాదన్నారు. చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్ కోసం ఆలోచిస్తున్నారని, ఎంత కష్టమైనా కూడా వెనుకాడటం లేదని చెప్పారు. వారి కలలను నిజం చేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. పదో తరగతి ఫలితాల్లో సిద్దిపేటకు ర్యాంకు వస్తుందంటే ప్రైవేటు పాఠశాలల పాత్ర కూడా ఉందని గుర్తుచేశారు. ప్రైవేట్ ఉపాధ్యాయులకు జీతాలు తక్కువ, పనిభారం ఎక్కువగా ఉంటుందని, అలాగే యజమాన్యాలకు కూడా చాలా ఇబ్బందులు ఉంటాయన్నారు. గతంలో సిద్దిపేట జిల్లాలోని ప్రైవేట్ ఉపాధ్యాయులకు వ్యక్తిగతంగా 5 లక్షల బీమా చేయించానని, ఈ సంవత్సరం కూడా బీమా చేయిస్తానని హామీ ఇచ్చారు. అంతేకాకుండా ప్రభుత్వం తరఫున ప్రైవేట్ ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు, బీమా సౌకర్యం అందించేలా ఒత్తిడి తెస్తామన్నారు. కార్యక్రమంలో ట్రెస్మా నాయకులు, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు



గురువందనం కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులు

రియల్ ఎస్టేట్ మాఫియా, భూ కబ్జాదారులపై కఠిన చర్యలు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 25: రియల్ ఎస్టేట్ పేరిట మోసాలకు పాల్పడితే, ప్రభుత్వ భూములను కబ్జాచేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఎస్పీ ఉదయ్‌కుమర్‌రెడ్డి ఆయనకు పూలమొక్కతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. అంతకుముందు ఎస్పీ జిల్లా సమగ్ర సమాచారాన్ని పీపీటీ ప్రజంటేషన్ ద్వారా ఐజీకి తెలియజేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ మహేందర్, మెదక్, తూప్రాన్ డీఎస్పీలు ప్రసన్నకుమార్, వెంకట్‌రెడ్డి, జిల్లా సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

గ్యాస్ గోదాంను పరిశీలించిన తహసీల్దార్



ఎస్‌వీఆర్ గ్యాస్ గోదాంలో తూకం వేస్తున్న సిలిండర్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణ

వెల్దుర్తి, సెప్టెంబరు 25: నిండుగా ఉన్న గ్యాస్ సిలిండర్ నుంచి ఖాళీగా ఉన్న సిలిండర్‌లో రీఫిల్ చేస్తున్న ఘటనపై తహసీల్దార్ కృష్ణ స్పందించారు. బుధవారం ఆర్ఐ జయభరత్‌రెడ్డి, సిబ్బందితో కలిసి స్థానిక ఎస్‌వీఆర్ ఇండెన్ గ్యాస్ గోదాంను తనిఖీ చేసి నిండు, ఖాళీగా ఉన్న గ్యాస్ సిలిండర్‌ను తూకం వేసి పరిశీలించి మాట్లాడారు. మంగళవారం దామరంచ గ్రామంలో జరిగిన ఘటనపై, గ్యాస్ గోదాంను పరిశీలించి, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులకు తెలిపామన్నారు.

గ్యాస్ ఏజెన్సీపై చర్యలు లేవి?

వెల్దుర్తి ఎస్‌వీఆర్ ఇండెన్ గ్యాస్ ఏజెన్సీలో ఎన్నో అక్రమాలు జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై వినియోగదారులు, ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్ల క్రితం ఏజెన్సీపై అవినీతి ఆరోపణలు రావడంతో సంబంధిత శాఖ అధికారులు వచ్చి పాత ఇండెన్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించి ఫైళ్లు తీసుకెళ్లారు. ఏజెన్సీ నిర్వాహకుడు తన రాజకీయ పలుకుబడితో అధికారులతో కుమ్మక్కై చర్యలు తీసుకోకుండా జాగ్రత్త పడ్డాడు. కొద్దినెలల క్రితం చిన్నశంకరంపేట మండలం ధర్పల్లిలో, మంగళవారం వెల్దుర్తి మండల పరిధిలోని దామరంచలో ఖాళీ సిలిండర్‌లో రీఫిల్ చేస్తూ పట్టుబడడం ఏజెన్సీ అక్రమాలకు అద్దం పడుతున్నాయి. మండలంలోని హస్తాల్‌పూర్ గ్రామానికి చెందిన గడ్డె లక్ష్మీబాయి గ్యాస్ బుక్ చేసుకున్నట్లు, సిలిండర్ డెలివరీ చేసినట్లు మెసేజ్‌లు వచ్చాయి. లక్ష్మీబాయి భర్త స్వామి ఈ విషయమై ఏజెన్సీ నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లగా పొరపాటు జరిగిందని చెప్పారు. మంగళవారం రాత్రి సైతం మరోసారి ఇలాంటి మెసేజ్ వచ్చినట్లు స్వామి తెలిపాడు.

ఉపాధి పనుల పరిశీలనలో అధికారులు విఫలం

ఝరాసంగం, సెప్టెంబరు 25: గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద చేపడుతున్న పనులను పర్యవేక్షించడంలో అధికారులు విఫలమయ్యారని మాచ్నూర్ గ్రామానికి చెందిన రైతు ప్రశాంత్ జిల్లా అధికారుల దృష్టికి తీసుకుపోయారు. బుధవారం ఝరాసంగంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో 14వ విడత ఉపాధిహామీ ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఉపాధిహామీ ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్లు ఇష్టానుసారంగా విధులను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఉపాధిహామీ పథకంలో మామిడిచెట్లను సాగుచేసినా ఏడాదిగా రికార్డులు చేయకుండా బిల్లులు ఇవ్వడం లేదన్నారు. ఉపాధి కూలీలకు సంబంధించిన మస్టర్లపై పంచాయతీ కార్యదర్శులు సంతకాలు చేయడం లేదని తనఖీల బృందం సభ్యులు తెలిపారు. దీంతో ఏపీడీ బాల్‌రాజు వారి పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని బిడెకన్నలో చేపట్టిన ఫీడర్‌చానెల్ పనుల్లో కొలతలు సక్రమంగా చేయకుండా సుమారు రూ.35 వేల బిల్లులు చెల్లించారని బృందం సభ్యులు సమావేశంలో అధికారులకు చెప్పారు. 2023-24లో మండలంలోని 33 గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులకు సంబంధించిన సామాజిక తనిఖీల నివేదికలను డీఆర్పీలు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో బాలరాజు, విజిలెన్స్ అధికారి నాగేశ్వరావు, ఎంపీడీవో సుధాకర్, ఏపీవో రాజ్‌కుమార్, జిల్లా క్వాసీ అధికారి సుభాష్, ఆయా గ్రామాల టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి ప్రశాంత్‌నగర్‌లోని బీసీ గురుకుల పాఠశాల

ఒకే గదిలో..


తరగతి గదిలో ట్రంకు పెట్టెల మధ్య చదువులు

- ట్రంకు పెట్టెలు, బస్తాల మధ్య చదువులు
- ఓ వైపు గదుల కొరత.. వసతులు కరువు
- డైనింగ్ హాల్ లేక ఆరు బయటే భోజనాలు
- సమస్యల వలయంలో సంగారెడ్డిలోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాల

పగలు తరగతులు, రాత్రి బస

ఏ పాఠశాల తరగతి గదిలో చూసినా ఓ వైపు బ్లాక్ బోర్డు, మరో వైపు బెంచీలపై విశాలంగా కూర్చున్న విద్యార్థులు కనిపిస్తుంటారు. కానీ ఇక్కడ మాత్రం రేకుల తరగతి గదులు, ఆ గదుల్లోనే చుట్టూరా ట్రంకు పెట్టెలు, బస్తాలు, బకెట్లు, మగ్గులు ఇతర సామగ్రి కనిపిస్తాయి. వీటన్నింటి మధ్యలో ఇక్కడి విద్యార్థులు పగలు విద్యాభ్యాసం, రాత్రి పడుకోవడం చేస్తున్నారు. ఇదేక్కడో కాదు.. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి ప్రశాంత్‌నగర్‌లోని బీసీ గురుకుల పాఠశాల దుస్థితి.

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 25 : సంగారెడ్డి ప్రశాంత్‌నగర్‌లోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల సమస్యలకు నిలయంగా మారింది. 5 నుంచి 9 వ తరగతి వరకు ఉన్న ఈ పాఠశాలలో సుమారు 300 మంది విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాల జిల్లా పరిషత్‌కు చెందిన గెస్ట్‌హౌస్‌లో అద్దె ప్రాతిపదికన కొంత కాలంగా కొనసాగుతున్నది. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ ఇక్కడ సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సొంత భవనం లేకపోవడంతో అద్దె భవనంలోనే అరకొర వసతులు మధ్య నెట్టుకొస్తున్నారు.


తరగతి గదిలోని గ్రిల్స్‌కి తగిలించిన మగ్గులు, వాటర్‌బాటిల్స్, టూత్‌బ్రష్‌లు

తరగతిగదుల కొరత..

ఈ గురుకుల పాఠశాలలో తరగతి గదులు కొరత తీవ్రంగా ఉన్నది. రెండు పక్కా భవనాలతో పాటు రేకులు షెడ్డుల్లోనూ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో సుమారు 10-12 గదులు ఉండగా.. ఏ మాత్రం సరిపోవడం లేదు. విచిత్రమేమంటే ఈ పాఠశాలలోని తరగతి గదుల్లో పగటి పూట ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు వింటుండగా, రాత్రిపూట ఇవే గదుల్లో నిద్రపోతారు. అంతే కాకుండా గదుల కొరతతో ఒకే గదిలో ట్రంకుపెట్టెలు, బ్యాగుల మధ్యలో విద్యనభ్యసించాలిసన దుస్థితి నెలకొన్నది. డార్మెటరీ, తరగతిగది ఒక్కటే కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఇక్కడి విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక రేకుల షెడ్డులోని గదుల్లో ఉండే విద్యార్థులు అటు వేసవి కాలంలో ఉకపోత, ఇటు వర్షాకాలంలో వానలకు ఇబ్బందులు తప్పడం లేదని చెబుతున్నారు.

డైనింగ్ హాల్ లేక..

ఈ పాఠశాలలో విద్యార్థులు అల్పాహారం, భోజనం చేసేందుకు డైనింగ్ హాల్ లేక ఆవరణలోని నేలపైనే కూర్చుని తింటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి ఈ పాఠశాలలో విద్యార్థులు పడుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

2008 డీఎస్సీ అభ్యర్థులు.. ఇక కాంట్రాక్టు టీచర్లు

- నియామకానికి సర్కారు గ్రీన్‌సిగ్నల్
- ఉమ్మడి జిల్లాలో 292 మంది అభ్యర్థులకు ఊరట

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 25 : ఎట్టకేలకు 2008-డీఎస్సీ అభ్యర్థుల నిరీక్షణకు తెరపడింది. వివిధ కారణాలతో ఆ అభ్యర్థుల నియామక ప్రక్రియ నిలిచిపోయిన విషయం తెలిసిందే. గతంలో అభ్యర్థులకు అనుకూలంగా కోర్టు తీర్పు ఇచ్చినా గత ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తాజాగా 2008 డీఎస్సీ బీఈడీ అభ్యర్థులను కాంట్రాక్టు ప్రాతిపదికన నియామకానికి సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఒక ప్రకటన కూడా విడుదల చేసింది. దీంతో ఉమ్మడి మెదక్ జిల్లాలో 292 మందికి ఊరట లభించనుంది. ఇలా ఉండగా వీరికి ఈ నెల 27 నుంచి అక్టోబరు 5వ తేదీ వరకు సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేపడుతారు. ఆ క్రమంలో కాంట్రాక్టు పద్ధతిలో టీచర్లుగా పనిచేసేందుకు అంగీకరిస్తున్నట్లు అభ్యర్థుల నుంచి రాతపూర్వకంగా తీసుకుంటారు. వీరికి మినిమమ్ టైమ్ స్కేల్ వేతనం ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో 17 ఏళ్ల నిరీక్షణకు తెరపడినట్టైంది.

సీడీసీ చైర్మన్‌గా గడీల రాంరెడ్డి

- సంబురాల్లో కాంగ్రెస్ శ్రేణులు


గడీల రాంరెడ్డి

సదాశివపేట, సెప్టెంబరు 25: సంగారెడ్డి జిల్లా గణపతి షుగర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఫసల్‌వాది (కేన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్) సీడీసీ చైర్మన్‌గా సదాశివపేట మండలం కంబాలపల్లి గ్రామానికి చెందిన ప్రస్తుత సంగారెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడీల రాంరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గడీల రాంరెడ్డి నియామకంతో సదాశివపేట మండల కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు చేసుకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

వేర్వేరు ఘటనల్లో ట్రాలీఆటో డ్రైవర్, మహిళ దుర్మరణం

హవేళిఘణపూర్, సెప్టెంబరు25 : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఔరంగబాద్ తండా శివారులో బుధవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం నర్సాపూర్ మండలంలోని చిన్నచింతకుంట గ్రామానికి చెందిన గామనగారి నరేష్‌గౌడ్(35) నందిని పాల ట్రాలీ ఆటో నడుపుతూ జీవించేవాడు. విధుల్లో భాగంగా మంగళవారం రాత్రి నందిని డైరీ పాల పాకెట్ల లోడుతో ఆటో కామారెడ్డి నుంచి మెదక్‌కు వెళ్తూ ఔరంగాబాద్ తండాశివారులో ఆగిఉన్న సిమెంట్ లారీని ఢీకొట్టాడు. దీంతో తలకు తీవ్రగాయాలైన నరేశ్‌గౌడ్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు,కుటుంబీకులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వ దవాకానకు తరిలించారు. మృతుడి తండ్రి దుర్గాగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రాజు తెలిపారు.

బైకు ఢీకొట్టడంతో మహిళ ..

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 25 : బైకు ఢీ కొట్టడంతో గాయాలపాలైన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రేణుకానగర్‌కు చెందిన కూచన్ మహేశ్వరి (50) బీడీ వర్కర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుంది. బుధవారం ఉదయం పని నిమిత్తం వెళ్తూ రేణుకానగర్ వద్ద ప్రధాన రోడ్డు డివైడర్ దాటుతుండగా వెనకనుంచి అక్షయ్ అనే యువకుడు బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలైన మహిళను గుర్తించిన స్థానికులు సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి కుమారుడు భానుప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యోగా శిక్షకుల పోస్టులకు నేడు ఇంటర్వ్యూలు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 25 : ఉమ్మడి జిల్లాలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన యోగా శిక్షకుల పోస్టుల భర్తీకి నేడు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆయూష్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ నర్మదాషిండే బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆయుర్వేద హాస్పిటల్‌లో ఉదయం 10.30 గంటల ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో 15 మేల్, 15 ఫిమేల్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

28న ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 25 : స్కూల్ గేమ్స్ జూనియర్ కాలేజ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28న ఉమ్మడి మెదక్ జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ గణపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్‌లోని ఇందిరాగాంధీ స్టేడియంలో అండర్-19 బాలబాలికల విభాగంలో ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఉదయం 9 గంటల వరకు పదోతరగతి మెమో, బోనాఫైడ్, బర్త్ సర్టిఫికేట్, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 8106841226, 9948221330 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

కొండపాక, సెప్టెంబరు 25 : ఓ వివాహిత అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. వివరాల్లోకి వెళ్లితే మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తేలు మహేశ్వరి(40) జ్వరం రావడంతో ఈ నెల 19న దుద్దెడలోని ఆర్‌ఎంపీ వద్ద చికిత్స చేయించుకున్నది. అయినా పరిస్థితి విషమించడంతో మొదట సిద్దిపేట ఆసుపత్రికి, తరువాత అక్కడి వైద్యుల సూచన మేరకు హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే ఖర్చులను భరించలేక తిరిగి మంగళవారం వంటిమామిడి ఆర్వీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. కాగా, ఆర్‌ఎంపీ చేసిన చికిత్స వికటించడం వల్లనే తీవ్ర అనారోగ్యానికి గురైందని మృతురాలి భర్త నర్సింహులు హైదరాబాద్‌కు తరలించే సమయంలో ఆరోపించాడు. అప్పటినుంచి సదరు వైద్యుడు కనబడటంలేదు. విచారణ నిమిత్తం వచ్చిన వైద్యశాఖ అధికారులు ఆర్‌ఎంపీ అందుబాటులో లేకపోవడంతో క్లినిక్‌ను సీజ్ చేశారు. అయితే మహిళ మృతదేహాన్ని బుధవారం అంబులెన్సులో ఇంటికి తీసుకువస్తున్న క్రమంలో దుద్దెడలో ఆపి ఆర్‌ఎంపీ వైద్యుడి క్లినిక్‌కు తీసుకెళ్లి ఆందోళనకు చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త నర్సింహులు అనారోగ్యంతోనే మృతి చెందినట్లు ఫిర్యాదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.


యువకుడి అదృశ్యం


మహేశ్ (ఫైల్)

చేర్యాల, సెప్టెంబరు 25 : యువకుడు అదృశ్యమైన ఘటన చేర్యాల మండలం నాగపురి గ్రామలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే గ్రామానికి చెందిన తలారి మహేశ్ కొంతకాలంగా చేర్యాల పట్టణంలోని మణికంఠ కిరాణాదుకాణంలో గుమాస్తాగా పని చేస్తున్నాడు. ఈ నెల 21న పనిమీద వెళ్లుండగా ఎదురుగా వచ్చిన వ్యక్తిని బైకుతో ఢీ కొట్టడంతో గుర్తుతెలియని వ్యక్తికి గాయలపై మానసికంగా బాధపడుతున్నాడు. అయితే రోజులాగే బుధవారం దుకాణానికని చెప్పి వెళ్లిన మహేశ్ కొద్దిసేపటికి తిరిగి వచ్చి బైకు, సెల్‌ఫోన్‌ను ఇంటివద్ద ఉంచి ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిపోయాడు. ఎంతకీ తిరిగిరాకపోవడంతో కుటుంబసభ్యులు బంధుమిత్రుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు కొమురవెల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఫ్లైఓవర్‌పై నుంచి కారు పల్టీ

- ఆరుగురు ఉపాధ్యాయులు గాయాలు



జోగిపేట, సెప్టెంబరు 25: కారు ఫ్లైఓవర్‌పై నుంచి పల్టీ కొట్టగా.. ఆరుగురు టీచర్లకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్లితే మండలంలోని నేరడిగుంట, అక్సాన్‌పల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆరుగురు ప్రభుత్వ ఉపాధ్యాయులు సంగారెడ్డి నుంచి ఒకే కారులో విధులకు వెళ్తుంటారు. బుధవారం కూడా కారులో బయలు దేరగా.. ప్రవీణ్ అనే ఉపాధ్యాయుడు డ్రైవ్ చేస్తున్నాడు. మాసాన్‌పల్లి శివారు జాతీయ రహదారిలోని ఫ్లైఓవర్‌పై కారు అదుపుతప్పడంతో కారు కిందికి పల్టీ కొట్టి సర్వీసు రోడ్డుపై పడింది. ఈ ఘటనలో టీచర్లు ప్రవీణ్, వరలక్ష్మి, పూర్ణ చందర్, మధుసూదన్ రెడ్డి, రాంచందర్, ప్రవీణ, జ్యోతి రత్నకుమారిలకు గాయాలుకాగా, 108 వాహనంలో జోగిపేటలోని ఏరియా ఆసుపత్రి తరలించి ప్రథమ చికిత్స అందించారు.

'గీతం'లో ప్రపంచ ఫార్మాసిస్ట్ డే

- మార్గదర్శనం చేసిన వక్తల ప్రసంగాలు


కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 25: గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ, హైదరాబాద్ బుధవారం ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవం 2024 ఘనంగా నిర్వహించారు. 'ప్రపంచ అవసరాలను తీరుస్తున్న ఫార్మాసిస్టులు అనే ఇతివృత్తం'తో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు నిపుణులు పాల్గొని ఫార్మా రంగ అభివృద్ధి, విస్తరణ, ఉపాధి అవకాశాలపై పలు సూచనలు చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న హైదరాబాద్‌లోని ఔషధ నియంత్రణ మండలి(ఇండియా) డిప్యూటీ డ్రగ్స్ కంట్రోలర్ డాక్టర్ ఎం.రాంకిషన్ మాట్లాడుతూ ఔషధ నియంత్రణ మండలి విధులు, పాత్ర, ఔత్సాహిక ఫార్మాసిస్టులకు ప్రభుత్వ శాఖల్లో అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను వివరించారు. ఔషధ భద్రత, నియంత్రణ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చేయడంలో ఫార్మాసిస్టుల కీలకపాత్రను నొక్కి చెప్పారు. ఆత్మీయ అతిథిగా పాల్గొన్న బొటానిక్ హెల్త్ కేర్ డైరెక్టర్, పరిశోధనా విభాగాధిపతి డాక్టర్ హెచ్.ఎస్.శివప్రసాద్, నివారణ ఆరోగ్య సంరక్షణకు పెరుగుతున్న ప్రాధాన్యాన్ని వివరించారు. మరో ఆత్మీయ అతిథి, కేర్ టీఆర్యూ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ డాక్టర్ ప్రియాంక దాస్, రోగి భద్రత, రక్షణ ప్రాధాన్యాన్ని వివరించారు. తొలుత, స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శివకుమార్ అతిథులను స్వాగతించి, సత్కరించారు, ఈ సందర్భంగా ఫార్మసీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బప్పాదిత్య ఛటర్జీ జీ8 ఫార్మ నెక్సస్ పేరుతో రూపొందించిన తొలి పత్రికను ఆవిష్కరించారు. పలు పోటీల విజేతలకు బహుమతుల పంపిణీచేశారు.

తనువు చాలించారు..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేర్వేరు ఘటనల్లో ఆరుగురు ఆత్మహత్య చేసుకున్నారు. వినాయక నిమజ్జనంలో తాగి డ్యాన్స్ చేయొద్దని తల్లి మందలించిందని ఒకరు.. భార్య పుట్టింటికి వెళ్లిందని మరొకరు ఇలా వేర్వేరు కారణాలతో బలవన్మరణానికి పాల్పడ్డారు. వీరిలో కొందరు ఆత్మహత్యాయత్నం చేసి చికిత్స పొందుతూ మృతిచెందారు.

వేర్వేరు ఘటనల్లో ఆరుగురు బలవన్మరణం

● తల్లి మందలించిందని..


వంశీ(ఫైల్)

తూప్రాన్, సెప్టెంబరు 25: వినాయక నిమజ్జనంలో తాగి డ్యాన్స్ చేయొద్దంటూ తల్లి అడ్డు చెప్పడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఉరేసుకున్నాడు. తూప్రాన్ ఎస్ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం ఘనపూర్ గ్రామానికి చెందిన జంగం బాలమణి, మల్లేశ్ దంపతులకు కుమారుడు జంగం వంశీ(18), కూతురు సంతానం. గ్రామంలో ఈనెల 21న రాత్రి వినాయక నిమజ్జనం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వంశీ తాగి నృత్యాలు చేస్తున్నాడు. తల్లి బాలమణి తాగి ఆడొద్దంటూ హెచ్చరించింది. దీంతో మనస్తాపానికి గురైన వంశీ తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకున్నాడు. కుటుంబీకులు గమనించి చికిత్స నిమిత్తం వెంటనే మేడ్చల్‌లోని మెడిసోవా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.

● కుటుంబ తగాదాలతో..


బాబు(ఫైల్)

శివ్వంపేట, సెప్టెంబరు 25 : అప్పుల బాధ, కుటుంబ కలహాలతో మనోవేదనకు గురైన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శభాష్‌పల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల పరకారం గ్రామానికి చెందిన బుడిగే బాబు (30) ఓ విత్తన పరిశ్రమలో పని చేస్తున్నాడు. రెండు నెలలుగా పనికి వెళ్లకపోవడంతో అప్పుల విషయంలో భార్యాభర్తల మధ్య ఘర్షణ జరుగుతున్నది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి భార్యతో గొడవపడిన బాబు మద్యం మత్తులో శభాష్‌పల్లి శివారులోని మూడుగుండ్ల మత్తడి చెక్‌డ్యామ్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గజఈతగాల్ల సహాయంతో మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహిపాల్ రెడ్డి తెలిపారు.

● ఆర్థిక ఇబ్బందులతో..

హవేళిఘణపూర్, సెప్టెంబరు 25 : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన అరిగె గోపాల్ (45) రైతు. కుటుంబ పోషణ, వ్యవసాయ పనుల నిమిత్తం అప్పులు చేశాడు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు, అప్పుల విషయమై మనోవేదనకు గురైన గోపాల్‌గ్రామ సమీపంలోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య పోచమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై నమియోద్దీన్ తెలిపారు.

● భార్య పుట్టింటికి వెళ్లిందని..


పరశురాములు మృతదేహం

కొండపాక, సెప్టెంబరు 25 : భార్య పుట్టింటికి వెళ్లిందని మనస్తాపం చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొండపాక మండలం అంకిరెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే గ్రామానికి చెందిన తాళ్లపల్లి పరశురాములు(40) తాగుడుకు బానిసై తరచూ భార్యతో గొడవపడేవాడు. ఈ విషయమై 20 రోజుల క్రితం భార్య వాణి పుట్టింటికి జప్తినాచారం వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన పరశురాములు ఈ నెల 21న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం సిద్దిపేట ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. భార్య ఫిర్యాదుతో త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● నిప్పటించుకున్న ఆటోడ్రైవర్..


విఠల్‌గౌడ్(ఫైల్)

హత్నూర, సెప్టెంబరు 25: పోలీస్‌స్టేషన్‌లో ఒంటిపై డీజిల్ పోసుకుని నిప్పంటించుకున్న ఆటో డ్రైవర్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్ఐ ఎస్ఐ సుభాష్ కథనం ప్రకారం హత్నూర మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పటేల్ విఠల్ గౌడ్(29) ఈ నెల 17న దౌల్తాబాద్ నుంచి ఆటోలో ప్రయాణికులను తీసుకుని మల్కాపూర్ వెళ్తుండగా.. వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఆటో సైడు ఇవ్వలేదని తిట్టడంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వాహనాలతో సహా ఇద్దరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఘర్షణ విషయమై బస్సు డ్రైవర్ అనిల్ ఆటో డ్రైవర్‌పై ఫిర్యాదు చేస్తున్న క్రమంలో విఠల్‌గౌడ్ ఒంటిపై డీజిల్ పోసుకొని నిప్పంటించుకోగా తీవ్ర గాయాలైన సంగతి తెలిసిందే. గాంధీ ఆసుపత్రిలో తొమ్మిది రోజుల పాటు చికిత్స పొందిన ఆయన మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

● చేవెళ్లలో అకౌంటెంట్..


శివకుమార్(ఫైల్)

అల్లాదుర్గం, సెప్టెంబరు 25 : ఇంట్లో చెప్పి బయటికెళ్లిన ఓ యువకుడు చెక్‌డ్యాంలో శవమై తేలిన సంఘటన అల్లాదుర్గం మండలం చేవెళ్లలో బుధవారం వెలుగుచూసింది. స్థానిక ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి, గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన చెన్న శివకుమార్ (30) సంగారెడ్డి జిల్లా కేంద్రంలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 22న ఇంట్లో పెద్దల పండగ నిర్వహించగా స్వగ్రామానికి వచ్చిన శివకుమార్ 23న సంగారెడ్డికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. కాగా, బుధవారం ఉదయం గ్రామ శివారులోని ఓ చెక్‌డ్యాంలో శివకుమార్ మృతదేహం తేలడంతో రైతులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఆర్థిక ఇబ్బందులతో అతడు ఆత్మహత్యకు చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయారు..

వివిధ ఘటనల్లో పలువురి మృతి

● జారి కిందపడి రైతు మృతి


రమేష్ మృతదేహం

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 25 : చేపల వేటకు వెళ్లిన రైతు మృతి చెందిన సంఘటన చిన్నశంకరంపేట మండలంలో బుధవారం చోటుచేసుకున్నది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు బుస్స రమేష్ (45) మంగళవారం ఇంట్లో నుంచి చేపలు పట్టేందుకు పెద్దమ్మకుంట వద్దకు వెళ్తున్నాని చెప్పి బయలుదేరాడు. తన సొంత పొలం ఒడ్డుపై నడుస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుమారుడు పొలం వద్దకు వెళ్లి చూడగా ఒడ్డుకింద విగితజీవిగా పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవపంచనామా నిర్వహించారు. మృతుడికి భార్య మైసమ్మ, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.

● కెనాల్‌లో పడి..


కిష్టయ్య మృతదేహాన్ని బయటకు తీసున్న దృశ్యం

గజ్వేల్ రూరల్, సెప్టెంబరు 25: కెనాల్‌లో పడి వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గజ్వేల్ మండల పరిధిలోని దాతర్‌పల్లి గ్రామంలోని కెనాల్‌లో వ్యక్తి మృతదేహం లభించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని విచారించగా.. మృతుడు అలిరాజుపేట గ్రామానికి చెందిన కుమ్మరి కిష్టయ్యగా గుర్తించారు. మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడిపోయి మృతిచెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● పిడుగు పడి గేదెల కాపరి..


జాటి పటేల్ (ఫైల్)

గుమ్మడిదల, సెప్టెంబరు 25 : పిడుగు పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం గుమ్మడిదల మండలం అన్నారం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి కథన ప్రకారం ఒరిస్సా రాష్ట్రానికి చెందిన జాటి పటేల్(36) అన్నారం గ్రామంలో కటుంబంతో కలిసి నివాసముంటున్నాడు. గ్రామంలోనే ఒకరి వద్ద గేదెలు కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. 24న గేదెలను యజమానికి కొడకుతో కలిసి మేతకు తీసుకెళ్లగా ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. అయితే యాజమాని కుమారుడు గేదెలను తోలుకొని ఇంటికి రాగా, జాటీ పటేల్ మాత్రం రాత్రి అయినా ఇంటికి రాలేదు. బుధవారం ఊరు బయట పడి ఉన్నాడని సమాచారం అందుకున్న అతని భార్య సంజూక్తా అక్కడికి వెళ్లి చూడగా మృతి చెంది కనిపించాడు. పిడుగుపాటుకు తన భర్త మృతి చెందాడని, ఎలాంటి అనుమానాలు లేవని మృతిని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

● విద్యుదాఘాతంతో రైతు..

హవేళిఘణపూర్, సెప్టెంబరు 25 : విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన కప్రాయిపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజిపేటతండా గ్రామపరిధిలోని కప్రాయిపల్లి గ్రామానికి చెందిన కుక్కల రాజు (25) వ్యవసాయం చేస్తూ జీవించేవాడు. ఉదయం పొలానికి నీరు పెట్టేందుకు బోరు ఆన్ చేసే క్రమంలో స్టార్టర్‌లోని వైరు చేతికి తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు కుటుంబీకులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసలు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఆస్పతికి తరలించారు. భార్య విజయ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కిసాన్ సంఘ్ డివిజన్ ఇన్‌చార్జిగా వేణుగోపాల్‌రెడ్డి

హుస్నాబాద్, సెప్టెంబరు 25: భారతీయ కిసాన్ సంఘ్ హుస్నాబాద్ డివిజన్ ఇన్‌చార్జిగా పట్టణానికి చెందిన కవ్వ వేణుగోపాల్‌రెడ్డిని నియమించారు. సిద్దిపేటలో బుధవారం నిర్వహించిన జిల్లా నూతన కార్యవర్గ ఏర్పాటు సందర్భంగా సంఘం మూడు రాష్ట్రాల ఇన్‌చార్జి రామ్ హుస్నాబాద్ డివిజన్ ఇన్‌చార్జిగా తనను నియమించినట్లు వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

'పనిచేసే చోట గుర్తింపు తెచ్చుకోవాలి'



బదిలీపై వెళ్తున్న అధికారులతో ఎంపీడీవో

మద్దూరు, సెప్టెంబరు 25: విధులు నిర్వహించే చోట గుర్తింపు తెచ్చుకోవాలని ఎంపీడీవో రామ్మోహన్ సూచించారు. బదిలీపై వెళ్లిన సెక్రటరీలు ఎంపీడీవో కార్యాలయ అధికారులకు బుధవారం కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన ఎంపీవో ఖాజామొయినుద్దీన్, జూనియర్ అసిస్టెంట్ ముదస్సీర్, సెక్రటరీలు బాలనర్సయ్య, నరేష్, నవీన్, సదానందం, అటెండర్ రమేష్‌లకు జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీవో వీరరాజ్, కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్ ఏఈ గౌస్ మొహియుద్దీన్ ఖాద్రీ, జూనియర్ అసిస్టెంట్ భాస్కర్, ఈసీ పరుశురాములు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు పోస్టాఫీస్ ఆధ్వర్యంలో లైఫ్ ఇన్సూరెన్స్‌పై అవగాహన

దౌల్తాబాద్, సెప్టెంబరు 25: దొమ్మాట పోస్టాఫీస్ ఆధ్వర్యంలో అత్యవసర సమయంలో ఉపయోగపడే లైఫ్ ఇన్సూరెన్స్ తదితర అంశాలపై పోస్ట్ ఆఫీస్ ఉన్నతాధికారి శ్రీహరి నేడు అవగాహన కల్పిస్తారని పోస్ట్‌మ్యాన్ కరికె శంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మంత్రిగారూ.. దుబ్బాకపై దయచూపరూ..?

- నేడు దుబ్బాకకు ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ
- సమస్యలతో స్వాగతం
- నిధుల విడుదలపై నీలినీడలు

దుబ్బాక, సెప్టెంబరు 25: భిన్నమైన ఆధిపత్య రాజకీయాలకు దుబ్బాక వేదికగా మారింది. దుబ్బాక నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి బీఆర్ఎస్‌లో ఉండడం, బీజేపీ నుంచి ఎంపీగా రఘునందన్ రావు గెలవడం, వీరి మధ్య ఆధిపత్య పోరులో కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ చక్రం తిప్పడం జరుగుతున్నది. దీంతో దుబ్బాక నియోజకవర్గానికి మంజూరైన నిధులు, బిల్లుల చెల్లింపులో పూర్తిస్థాయిలో వివక్ష జరుగుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గురువారం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసేందుకు మొదటిసారి రానున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖకు సమస్యలు స్వాగతం పలకనున్నాయి.

నిధుల నిలుపుదల

దుబ్బాక మున్సిపాలిటీకి గత ప్రభుత్వం 2023లో రూ.10 కోట్లను టీయూఎఫ్ఐడీసీ కింద మంజూరీ అయ్యాయి. అందులో రూ.3 కోట్లతో హబ్షీపూర్ రహదారి విస్తరణకు, 20 వార్డుల్లో అంతర్గత రహదారులు, మురుగు కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. 2020 సంవత్సరంలో రూ.20 కోట్లు సీఎం ప్రత్యేక నిధుల కింద మంజూరుకాగా.. అందులో పనులు కాకుండా మిగిలిన రూ.6 కోట్లకు 2023లో తిరిగి ప్రతిపాదనలు పంపారు. ఈ రూ.6 కోట్లలో రూ.2 కోట్లను టౌన్ హాల్, గ్రంథాలయాలనికి రూ.కోటి, రూ.70 లక్షలతో శ్మశానవాటికలు, రామసముద్రం చెరువు నుంచి రిజిస్ట్రేషన్ కార్యాలయం వరకు రింగ్‌రోడ్డు ఫార్మేషన్‌కు రూ.50 లక్షలు, రూ.25 లక్షలతో ప్రెస్‌క్లబ్, తదితర అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపగా.. గత ప్రభుత్వం మంజూరు చేసింది. ఎన్నికల కోడ్ రావడంతో ఆ నిధులను ఆపేశారు. మంత్రి సురేఖ ఆదేశాలతో నిధులు నిలిపేసినట్లు ప్రచారం జరిగింది. దుబ్బాకలో బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలువడంతో రాజకీయ ముఖచిత్రం మారిపోయింది. కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ప్రతిపాదించిన పనులకు నిధులు మంజూరు చేయాలనే కృతనిశ్చయంతో దుబ్బాక మున్సిపాలిటీకి మంజూరైన నిధులను తిరిగి ప్రతిపాదనలకు సూచించారు. కలెక్టర్ ద్వారా గత ప్రతిపాదనలను రద్దుచేస్తూ, కొత్త ప్రతిపాదనలకు ఆదేశించారు. ఇందులో మాజీ మంత్రి చెరుకు ముత్యం రెడ్డి గతంలో శంకుస్థాపన చేసిన స్థలంలో రూ.4.50 కోట్లతో స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారు. రూ.50 లక్షలతో సోలార్ ఫినిషింగ్, స్టేడియానికి వెళ్లేందుకు బీటీరోడ్డుకు రూ.1.72 కోట్లు, మరో రూ.కోటి గ్రంథాలయానికి, రూ.1.36 కోట్లతో దుబ్బాక చుట్టూ సోలార్ దీపాలు బిగింపునకు ప్రతిపాదనలు పంపారు. రుషివనం నుంచి దుంపలపల్లి రహదారికి రూ.1.61 కోట్లు, రామసముద్రం సుందరీకరణకు రూ.50 లక్షలు, సీసీ, మురుగు కాలువలకు రూ.4 కోట్ల పైచిలుకు ప్రతిపాదనలు పంపారు.



కూరగాయల మార్కెట్ లేక రోడ్డుపైనే క్రయవిక్రయాలు జరుపుతున్న రైతులు

ఆరునెలలుగా ఎదురుచూపే

ఆరునెలలుగా ప్రతిపాదిత నిధులు మంజూరు కాకపోవడంతో పలు విమర్శలకు దారితీస్తున్నది. అలాగే పంచాయతీ రాజ్‌శాఖలో రూ.200 కోట్ల పనులకు సంబంధించిన నిధులు నిలిచిపోయాయి. నీటిపారుదల శాఖ, ఆర్అండ్‌బీ శాఖల్లోని పనులకు సంబంధించిన నిధులు కూడా ఆగిపోయాయి. గురువారం దుబ్బాకకు రానున్న ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ పై సమస్యలపై ఏవిధంగా స్పందిస్తారో వేచిచూడాలి.

గుంతలను పూడ్చివేయించిన అధికారులు



సైడ్‌బర్మ్‌ల వద్ద మట్టి పోసి చదును చేస్తున్న సిబ్బంది

గజ్వేల్, సెప్టెంబరు 25: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని జగదేవ్‌పూర్‌లో రోడ్డులో కొట్టుకుపోయిన సైడ్ బర్మ్‌లను మున్సిపల్ అధికారులు మట్టితో పూడ్చివేయించారు. ఈ నెల 15న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన రోడ్డంతా గుంతలే కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్ ఆధ్వర్యంలో బుధవారం మట్టితో గుంతలను పూడ్చించి చదును చేయించారు. స్థానికులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు



డీజీపీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఏఎస్ఐ జగదీశ్వర్

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 25: సిద్దిపేట పోలీస్ కమిషనర్ పరిధిలో పనిచేస్తున్న ఇద్దరు పోలీసులకు అరుదైన గౌరవం లభించింది. రిసెప్షన్ పట్టికలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ సేవలు అందించి ఐదో స్థానంలో నిలిచినందుకు త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ మహిళా కానిస్టేబుల్ కవితకు, ఉత్తమ పౌర సేవలు అందించి రాష్ట్రస్థాయిలో 10వ స్థానంలో నిలిచిన మద్దూర్ పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ జగదీశ్వర్‌కు డీజీపీ జితేందర్ బుధవారం ప్రశంసాపత్రం అందజేసి సన్మానించారు.

వృత్తిపరమైన సామర్థ్యం పెరుగుతుంది

- ఏఆర్ అదనపు డీసీపీ రామచంద్రరావు

చిన్నకోడూరు, సెప్టెంబరు 25: వృత్తిపరమైన సామర్థ్యం పెంపుదలకు డ్యూటీ మీట్ ఉపయోగపడుతుందని ఏఆర్ అదనపు డీసీపీ రాంచంద్రరావు తెలిపారు. మండలంలోని పెద్దకోడూరు శివారులోని సీఏఆర్ హెడ్ క్వార్టర్‌లో పోలీస్ అధికారులకు, సిబ్బందికి బుధవారం ఆయన ఆధ్వర్యంలో పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పోటీలు, ఈవెంట్స్ నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డ్యూటీ మీట్ వల్ల ఒకరి నుంచి మరొకరు కొత్త విషయాలు తెలుసుకుంటారన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రాజేష్, ఆర్ఎస్ఐలు రోహిత్, వెంకట్‌రమణ, రంజిత్, అంజయ్య పోలీసు అధికారులు, సిబ్బంది, బీడి టీమ్, డాగ్‌స్క్వాడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయం పేరును మార్చవద్దు

- ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి



సిద్దిపేట టౌన్: మాట్లాడుతున్న శ్రీనివాస్

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు25: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును మార్చవద్దని ఆర్య వైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి గంప శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సిద్దిపేటలోని కలెక్టరేట్ వద్ద ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖకు రాష్ట్ర కార్యవర్గం సభ్యులు అయిత రత్నాకర్, జిల్లా అధ్యక్షుడు కాచం నవీన్‌కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గంప మహేందర్‌రావుతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును తొలగించి సురవరం ప్రతాప్ రెడ్డి పేరును పెట్టేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించడంతో, రాష్ట్రంలోని ఆర్య వైశ్యుల మనోభావాలు దెబ్బతింటున్నాయని, సురవరం ప్రతాప్‌రెడ్డి చేసిన సేవలకు గుర్తుగా మరేదైన ప్రాజెక్టుకు వారి పేరు రాష్ట్ర ప్రభుత్వం పెట్టాలని కోరారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య మహాసభ నాయకులు పాల్గొన్నారు.

- వర్గల్: తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరునే కొనసాగించాలని వర్గల్, ములుగు, మర్కుక్ మండలాల ఆర్యవైశ్య సంఘం నేతలు బ్రాహ్మణ్డపల్లి వెంకటయ్య గుప్తా, దోసపాటి గోపాల్ గుప్తా, గుండ శ్రీనివాస్ గుప్తా డిమాండ్ చేశారు. గౌరారం వద్ద బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించిన పొట్టి శ్రీరాములు పేరును మార్చి తమ మనోభావాలను దెబ్బతీయవద్దన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు జూలూరి రంగయ్య, బిక్షపతి గుప్తా, సుధాకర్ గుప్తా, శివ, లక్ష్మీనర్సయ్య రమేశ్ ఉన్నారు.

దీన్‌దయాల్ ఆశయాలను కొనసాగిద్దాం

- బీజేపీ నాయకులు



సిద్దిపేట రూరల్: దీన్ దయాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 25: భారతీయ జనసంఘ్ సిద్ధాంతకర్త పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ఆశయాలను కొనసాగిద్దామని బీజేపీ మండల అధ్యక్షుడు అన్నసారం సురేష్‌గౌడ్ పేర్కొన్నారు. దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుమల్‌రెడ్డి, జిల్లా మెడికల్ సెల్ కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి, కిసాన్ మోర్చా సోషల్ మీడియా కన్వీనర్ తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శులు నవీన్, త్రిలోచన్‌రెడ్డి, శక్తి కేంద్ర ఇన్‌చార్జి శ్రీనివాస్, బూత్ అధ్యక్షులు, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

- గజ్వేల్: దీనదయాళ్ ఉపాధ్యాయ చూపించిన బాటలో పయనిద్దామని బీజేపీ గజ్వేల్ పట్టణాధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్ అన్నారు. దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనవెంట జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి ఏగొండ, గజ్వేల్ పట్టణ బీజేపీ ఉపాధ్యక్షులు నాయిని సందీప్, నర్సింహ, చెప్యాల వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్, రాజు తదితరులున్నారు.
- దుబ్బాక: దుబ్బాకలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు నివాసంలో పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతిని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాలేష్‌గౌడ్, సుభాష్‌రెడ్డి, రోశయ్య, వెంకట్‌గౌడ్, ప్రవీన్, బద్రి, రాజశేఖర్, శ్రీకాంత్ ఉన్నారు.

'ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకం'

గజ్వేల్ రూరల్, సెప్టెంబరు 25: ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకమని రజకసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీధర్ పేర్కొన్నారు. గజ్వేల్‌లో బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. భూమి బుక్తి, వెట్టి చాకిరీ విముక్తి కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని రగిలించిన నిప్పుకణం చిట్యాల ఐలమ్మ అన్నారు. ఐలమ్మ జీవితమే తనుకు స్ఫూర్తని, యువత ఐలమ్మ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వారన్నారు.

కుకునూరుపల్లి: మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని నేడు ఆవిష్కరించనున్నారు. రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి తరలిరావాలని రజక సంఘం సభ్యులు పిలుపునిచ్చారు.

బీజేపీకి అపూర్వ స్పందన

వర్గల్, సెప్టెంబరు 25: మండలంలోని ఏ గ్రామానికి వెళ్లినా బీజేపీకి అపూర్వ స్పందన లభిస్తున్నదని పార్టీ మండల అధ్యక్షుడు టేకులపల్లి బాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మజీద్‌పల్లి, మినాజీపట, అనంతగిరిపల్లి, నాచారం గ్రామాల్లో బుధవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పథకాలకు ప్రజలు ఎంతగానో ఆకర్షితులైనట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పంపరి రమేశ్, తిరుపతిరెడ్డి, రమేశ్, కాయిత రాజు, శ్రీకాంత్ ఉన్నారు.

ఇసుక లారీ పట్టివేత

కోహెడ, సెప్టెంబరు 25: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని బుధవారం పట్టుకున్నట్లు ఎస్ఐ అభిలాష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు శనిగరం రాజీవ్ రహదారిపై తనిఖీలు చేసి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని పట్టుకొని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బిల్లులను బయటపెట్టాలి

దుబ్బాక,సెప్టెంబరు 25: బతుకమ్మ సంబురాల పేరుతో దుబ్బాక మున్సిపాలిటీలో కౌన్సిలర్లు చేసిన బిల్లుల అవినీతి భాగోతాన్ని బయటపెట్టాలని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం దుబ్బాక పార్టీ క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలతో కలిసి ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీలో అవినీతి జరిగిందని ఆరోపించారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్, నాయకులు ఆకుల దేవేందర్, చంద్రారెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

వీఆర్ఏల సంఘం వినతి

రాయపోల్, సెప్టెంబరు 25: గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం 61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏ వారసులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని వీఆర్ఏ కారుణ్య నియామకాల సంఘం మండల అధ్యక్షుడు పంగ స్వామి కోరారు. రాయపోల్ తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం గిర్దావర్ భానుప్రకాష్‌రావుకు వినతిపత్రం అందజేశారు. వీఆర్ఏల డిమాండ్‌లను వెంటనే నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.

పంచాయతీ సెక్రటరీలకు వైద్యపరీక్షలు



మద్దూరు: రేబర్తి పంచాయతీ కార్మికులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

మద్దూరు/కుకునూరుపల్లి, సెప్టెంబరు 25: మండలంలోని లద్నూరు పీహెచ్‌సీ, రేబర్తిలోని పల్లె దవాఖాన ఆధ్వర్యంలో వైద్యాధికారులు బుధవారం గ్రామపంచాయతీ సెక్రటరీలు, కార్మికులకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు సుధీర్‌రాజ్, సువర్చసన్ మాట్లాడారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్న పంచాయతీ సెక్రటరీలు, పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఏ దేవదాసు, ఏఎన్ఎం మల్లేశ్వరి, లలిత, ఆశాలు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికులకు వివిధ పరీక్షలను నిర్వహించారు. అంతకుముందు కార్మికులకు నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీవో విష్ణు, వైద్యాధికారి పర్వీన్, పంచాయతీ కార్యదర్శులు స్వప్న, రాంప్రసాద్ తదితరులు ఉన్నారు.

విలువలతో కూడిన విద్యను అభ్యసించాలి: కళాశాల ప్రిన్సిపాల్

మద్దూరు, సెప్టెంబరు 25: విలువలతో కూడిన విద్యను అభ్యసించి విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ సూచించారు. మద్దూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులు ఫ్రెషర్స్‌డే జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. విద్యార్థుల్లో ఫ్రెషర్స్ డే వేడుకలు నూతనోత్సాహాన్ని నింపాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ కంఠారెడ్డి జనార్దన్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.


ఔషధాల పంపిణీలో ఫార్మాసిస్టులే కీలకం

- ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ

గజ్వేల్, సెప్టెంబరు 25: ఔషధాల పంపిణీలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమని సురభి దయాకర్‌రావు ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. వెంకటరమణ అన్నారు. గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామ సమీపంలోని సురభి దయాకర్‌రావు ఫార్మసీ కళాశాలలో ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవం సందర్భంగా బుధవారం కళాశాల విద్యార్థులకు రంగోలి, పోస్టర్ ప్రజెంటేషన్, డిబేట్, క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గణేష్, సిబ్బంది స్వాతి, సౌమ్య, సౌందర్య ఎస్. పూజిత బి.అరుణ, శ్రీముఖి, నరేష్‌రెడ్డి, కృష్ణ, మాజీద్, ప్రవీణ్, కరుణాకర్, రజిత, విద్యార్థులు పాల్గొన్నారు.

- హుస్నాబాద్ టౌన్: హుస్నాబాద్ పట్టణంలో ప్రపంచ ఫార్మసిస్టు దినోత్సవాన్ని పట్టణ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఫార్మసిస్టు సభ్యులను మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు బింగి శ్రీనివాస్ శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు దాసరి వినోద్, కనుకుంట్ల శ్రీనివాస్, రావుల రంజిత్, బింగి వెంకటరమణ, వేముల సంధ్య, బండారి దినేష్, ఇజ్జగిరి శ్రీకాంత్, రామక్రిష్ణ, భరద్వాజ్, వంశీ తదితరులున్నారు.

'పోషకాహారంతోనే ఆరోగ్యం'



పీర్లపల్లిలో మాట్లాడుతున్న సీడీపీవో సరిత

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 25: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని సీడీపీవో సరిత పేర్కొన్నారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలో పీర్లపల్లిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాని, ప్రత్యేకాధికారి వసంతరావు, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు అంగన్‌వాడీ టీచర్లు తదితరులున్నారు.

'టీచర్ల సర్దుబాటు జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలి'

గజ్వేల్, సెప్టెంబరు 25: టీచర్ల రేషనలైజేషన్ జీవోను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని టీపీటీఎఫ్ గజ్వేల్ మండలం అధ్యక్షుడు తాళ్ల నాగరాజు, ప్రధాన కార్యదర్శి గోక విద్యాసాగర్ డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గజ్వేల్ జోన్ సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించి రేషనలైజేషన్ జీవో 25 పూర్తిగా అశాస్త్రీయమైనదని, 60మంది విద్యార్థులకు ఇద్దరు, 90మంది విద్యార్థులకు ముగ్గురు టీచర్లు ఉండాలనే నిబంధనను తీసివేయాలన్నారు. వారితో టీపీటీఎఫ్ నాయకులు తదితరులున్నారు.

- వర్గల్: ఉపాధ్యాయుల సర్దుబాటు పేరిట అశాస్త్రీయమైన నిబంధనలతో రూపొందించిన జీవో 25ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్టీయూ రాష్ట్రశాఖ పిలుపు మేరకు, మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైయ్యారు. భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, మొహినోద్దిన్ మాట్లాడుతూ.. జీవో 25ని అమలు చేయడం వల్ల ప్రాథమిక విద్యారంగం నిర్వీర్యం అయ్యే అవకాశం ఉందన్నారు.

వంతెనను పరిశీలించిన అధికారులు



కొలతలు తీసుకుంటున్న అధికారులు

కోహెడ, సెప్టెంబరు 25: మండలంలోని తంగళ్లపల్లి, శనిగరం గ్రామాల మధ్య ఉన్న లోలెవెల్ వంతెనను నీటిపారుదల శాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. ఇటీవల బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ వంతెనను పరిశీలించారు. ప్రతీ ఏటా వరదలతో ఇబ్బందులు పడుతున్నమని స్థానికులు మంత్రికి వివరించారు. దీంతో హై లెవెల్ వంతెన, చెక్ డ్యాం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని నీటి పారుదల శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. దీంతో నీటి పారుదలశాఖ డీఈఈ రుహీన, ఏఈ రవీష్ నిర్మాణల స్థలాన్ని పరిశీలించారు. వారివెంట కాంగ్రెస్ నాయకులు బండిపల్లి నారాయణగౌడ్, పాము శ్రీకాంత్, పులి రాజుగౌడ్, బత్తిని సంపత్ కుమార్ బుర్ర రవి, పులి మధు, సంపత్ కుమార్ ఉన్నారు.

రోడ్ల విస్తరణ, నిర్మాణం చేపట్టాలి

- మంత్రికి వినతిపత్రం సమర్పించిన మాజీ జడ్పీటీసీ



మంత్రితో మాజీ జడ్పీటీసీ నర్సింగరావు

చేర్యాల, సెప్టెంబరు 25: చేర్యాల ప్రాంతంలోని పలు గ్రామాల్లో రోడ్డు విస్తరణతో పాటు నూతన రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బుధవారం వినతిపత్రం అందించారు. చేర్యాల-నాగపురి, చేర్యాల-తరిగొప్పుల, చేర్యాల-మద్దూరు రోడ్లను రెండులైన్ల రహదారిగా మార్చాలని విన్నవించారు. స్పందించిన మంత్రి ఆయా రోడ్లు నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే సిద్ధంచేసి అందించాలని సూచించారు. అలాగే టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి జనగామ నియోజకవర్గంలో పార్టీ కోసం కష్టపడినవారికి తగిన గుర్తింపునందించి నామినేటెడ్ పదవులలో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

'రుణమాఫీ అమలు కాలేదు'

బెజ్జంకి, సెప్టెంబరు 25: ప్రభుత్వం అమలు చేసిన రైతు రుణమాఫీ ఇంతవరకు తమకు అమలు కాలేదని బ్యాంకు ఎదుట బుధవారం రైతులు ఆందోళన చేపట్టారు. మండలంలోని తోటపల్లి ఇండియన్ బ్యాంకులో వ్యవసాయ రుణాలు తీసుకున్నామని, అర్హులమైనా ఇంతవరకు మాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు బ్యాంకు వద్దకు వెళ్లి ఆందోళన చేస్తున్న రైతులకు మద్దతు తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అర్హులైన ఎంతో మంది రైతులకు రుణమాఫీ కాలేదని, రైతులను మోసం చేస్తూ ప్రభుత్వం మాయ మాటలు చెబుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ మంత్రి ఇనగాల పెద్దిరెడ్డి, మండలాధ్యక్షుడు కొలిపాక రాజు, ప్రధాన కార్యదర్శి అనిల్‌రావు, వరుణ్‌రావు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.



బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

ఎంఈవోల బాధ్యతల స్వీకరణ

దూళిమిట్ట, సెప్టెంబరు 25: దూళిమిట్ట మండల విద్యాధికారిగా బుధవారం భైరాన్‌పల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మీనాంజనేయులు అదనపు బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో పలువురు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

- మద్దూరు: మండలంలోని రేబర్తి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. వరదరాజు మద్దూరు మండల ఎంఈవోగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంఈవోగా విధులు నిర్వహించిన ఉదయ్ భాస్కర్‌రెడ్డి గజ్వేల్‌కు వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన వరదరాజులను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, ఎమ్మార్సీ సబ్బంది, సీఆర్పీలు పాల్గొన్నారు.
- గజ్వేల్: గజ్వేల్ ఎంఈవోగా వై.కృష్ణ బాధ్యతలు స్వీకరించారు. 14 ఏళ్లుగా గజ్వేల్ ఎంఈవోగా పనిచేసిన కె.సునిత వర్గల్ మండలానికి బదిలీపై వెళ్లగా, ప్రజ్ఞాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న కృష్ణ ఎంఈవోగా వచ్చారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఆయనను శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు.
- మర్కుక్: మండల నోడల్ అధికారిగా పనిచేస్తున్న దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు వెంకటరాములును మర్కుక్ మండల ఎఫ్ఏసీ ఎంఈవోగా ప్రభుత్వం నియమించింది. ఎమ్మార్సీలో ఎంఈవో ఉదయభాస్కర్‌రెడ్డి నూతన ఎంఈవో వెంకటరాములుకు బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో మర్కుక్ మండల పీఆర్టీయూ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కుమార్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఉన్నారు.
- జగదేవ్‌పూర్: జగదేవ్‌పూర్ మండల విద్యాధికారిగా ఇటిక్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాధవరెడ్డి బాధ్యతలు చేపట్టారు.
- మిరుదొడ్డి: అక్బర్‌పేట-భూంపల్లి ఎంఈవోగా ఎనగుర్తి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు అంజయ్య బాధ్యతలను స్వీకరించారు. అంజయ్యను రాష్ట ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శాలువతో సన్మానించారు. ఆయన వెంట జన్నారెడ్డి, దుబ్బరాజం తదితరులున్నారు.

మిరుదొడ్డి ఎంఈవోగా మల్లుపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు.



దూళిమిట్ట: బాధ్యతలు స్వీకరిస్తున్న మీనాంజనేయులు



మర్కుక్: బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకట్రాములు

'ఎస్సీ కార్పొరేషన్ నిధులు మంజూరు చేయాలి'

చేర్యాల, సెప్టెంబరు 25: దళిత కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు చేసి వివిధ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి న్యాయం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ కోరారు. చేర్యాలలో బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ఎంతోమంది నిరుపేదలు ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు చేయలేదని, దళితబంధు ద్వారా గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నేతలకు వర్తించేసి నయవంచనకు పాల్పడిందన్నారు. సమావేశంలో నాయకులు ఈరు భూమయ్య, వలబోజు నర్సింహచారి, గూడెపు సుదర్శన్, స్వామి దాసు, సురేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి: ఎంఈవో దేశిరెడ్డి

నంగునూరు, సెప్టెంబరు 25: విద్యార్థులు చదువులో మండలాన్ని ఎలాగైతే ప్రథమ స్థానంలో నిలిపారో అదే స్ఫూర్తితో క్రీడల్లో రాణించి మండలానికి గుర్తింపు తీసుకురావాలని ఎంఈవో దేశిరెడ్డి సూచించారు. మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల ముగింపు సందర్భంగా నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌గౌడ్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించాలి



కార్యక్రమంలో ప్రోగ్రాం ప్రతినిధులు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 25: ప్రాథమికి స్థాయి నుంచే విద్యార్థులకు శాస్త్రీయ విజ్ఞానాన్ని అందించాలనే లక్ష్యంతో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రాం ప్రతినిధి స్రవంతి పేర్కొన్నారు. సిద్దిపేట ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో టెక్ మహీంద్ర ఫౌండేషన్, సహాయక ట్రస్ట్, సైన్స్ ఆకాడమీ, సమగ్ర శిక్ష అధ్వర్యంలో జిల్లా స్థాయి ఉపాధ్యాయ శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ప్రతినిధులు స్రవంతి, సుమనలను ఉపాధ్యాయులు సత్కరించారు.

సేంద్రియ పద్ధతులతో వ్యవసాయం చేయాలి

- లోడీ సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బాలశౌరి

అక్కన్నపేట, సెప్టెంబరు 25: రైతులు ఆర్గానిక్ పద్ధతులతో వ్యవసాయం చేయాలని లోడీ సంస్థ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ బాలశౌరి అన్నారు. మండలంలోని కేశనాయక్‌తండా, మల్చుకుంటతండా, లచ్చనాయక్‌తండా, చౌడుతండా, బోదరవాగుతండా, మంజ్యానాయక్ తండా, మైసమ్మవాగుతండాలోని మనోస్ యూనిడాస్ సహకారంతో బుధవారం లోడీ సంస్థ ఆధ్వర్యంలో 100 మంది రైతులకు వర్మీ కంపోస్టు ఎరువు తయారీ పీట్స్ నిర్మించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్మీ కంపోస్టు ఎరువు వాడితే అధిక దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో లోడీ సంస్థ మండల ఫీల్డ్ కోఆర్డినేటర్ కోడం సత్యనారాయణ, ప్రతినిధులు రవీందర్, బిచ్చ, తిరుమల, రమేష్, రైతులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు ఎమ్మెల్యే 'పల్లా' పరామర్శ

చేర్యాల, సెప్టెంబరు 25: ఇటీవల స్థానిక గాంధీచౌక్ వద్ద జరిగిన దాడిలో తీవ్రగాయాలపాలైన బీఆర్ఎస్ కార్యకర్తలు అవుశర్ల కిషోర్, అవుశర్ల వెంకటేశ్‌లను బుధవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. వైద్య పరీక్షలతో పాటు ఆరోగ్య పరిస్థితి అడిగితెలుసుకున్నారు. అనంతరం పోలీసులతో ఫోన్‌లో మాట్లాడి దాడిచేసి వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీని సందర్శించారు. కొంతసేపు ఆటవిడుపుగా బ్యాటింగ్ చేసి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. ఆయనవెంట మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు పెడతల ఎల్లారెడ్డి, కౌన్సిలర్ మంగోలు చంటి, బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జింకల పర్వతాలుయాదవ్, నాయకులు శివగారి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మర్పడగలో వైభవంగా ఆర్ద్రా మహోత్సవం

కొండపాక, సెప్టెంబరు 25: మండలంలోని మర్పడగ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జునస్వామి క్షేత్రంలో బుధవారం ఆర్ద్రా మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ పర్యవేక్షణలో గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభం కాగా సంతాన మల్లికార్జున స్వామివారికి సంతాన పాశుపత అభిషేకం విజయదుర్గామాతకు విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో క్షేత్ర నిర్వహణా కమిటీ సభ్యులు నర్సింహారెడ్డి, మల్లేశం, చీకోటి మల్లికార్జున్, మర్యాల రవి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

బస్వాపూర్‌లో సాధనసురుల విన్యాసాలు



విన్యాసాలు చేస్తున్న సాధన సురులు

కోహెడ, సెప్టెంబరు 25: మండలంలోని బస్వాపూర్‌లో మూఢనమ్మకాలపై సాధనసురులు బుధవారం విన్యాసాలు ప్రదర్శించారు. మంత్రాలు తంత్రాలు లేవని, మూఢనమ్మకాలను అసలే నమ్మవద్దని ఈ ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు కొక్కుల రమేష్, యువజన సంఘం అధ్యక్షుడు వేముల నరేష్, గంజి శంకర్ లు ఉన్నారు.